# ఆటోమేటిక్

సమయస్ఫూర్తి అంటే ఏమిటో శ్రీనివాసును చూసి నేర్చుకోవాల్సిందే. కాని ఏం లాభం? ఈ వ్యవహారంలో మాత్రం సంయమనమే శరణ్యమైంది. అయినా... సంయమనం కూడా సమయస్ఫూర్తిలో భాగమే గదా!

సావర్కర్ చౌరస్తాలో హుషారుగా నుంచున్నాడు. మనసు మాత్రం - తొలకరి చినుకుకోసం ఎదురుచూస్తున్న చకోరపక్షిలా, పద్మకోసం... ఆ పద్మాక్షిచూపుకోసం పరితపిస్తూంది. ఆ జవ్వని అవయవ సంపదను మనసారా గ్రోలాలని ఉవ్విళ్ళూరుతోంది.

ఆ సుందర వదన రోజా శివాజీ చౌక్‌లో నవ్వుతూ బస్సు దిగుతుంది. పక్కనున్న సావర్కర్ చౌరస్తా దాకా నాజూగ్గా నడిచొస్తుంది. అరవిరిసిన ముఖారవిందం, అరచేతులంత కళ్ళు, చెవులకు ఉయ్యాల లూగుతున్న మకర కుందనాలు, సన్నని నడుము, నున్నని ఒళ్ళు.... చూడముచ్చటగా ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే దివి నుండి భువికి దిగివచ్చిన దేవకన్యలాగుంటుంది.

సావర్కర్ చౌరస్తాలో ఆటో ఎక్కి, ఐదు కిలోమీటర్లు అరమరికలు లేకుండా ప్రయాణించి, ఫైర్‌స్టేషన్ వద్ద దిగిపోతుంది అక్కడికి అతి దగ్గరలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పాఠాలు చెబుతుంది. శ్రీనివాసు కూడా అదే చౌరస్తాలో, ఆవిడ ఎక్కిన ఆటోలోనే ఎక్కేసి అదే ఫేర్‌స్టేషన్ వద్ద దిగిపోతాడు ప్రాథమిక పాఠశాలకు

ఎదురుగా జూనియర్ కళాశాలలో జాలీగా లెక్చర్లిస్తుంటాడు సాయంత్రం కూడా ఆవిడతోనే ఆటో ఎక్కి ఇదే సావర్కర్ చౌరస్తాలో దిగుతాడు. చూపులు కలిసిన శుభవేళా . పాటను నెమరేసుకుంటూ విడిపోతాడు కలలో ఆవిడ ఒడిలో ఒరిగిపోతుంటాడు

పాఠాల పంతులమ్మ, లెక్చర్ల లెక్చరర్. ఒక రంటే ఒకరికి ఏదో ఇది. ఆ ఇదికి నిర్వచనం చెప్పించుకోవాలని శ్రీనివాసు తంటాలు పడుతున్నాడు. మొదటి మూడ్రోజులు ఆటోలో కాకతాళీయంగా కలుసుకున్నారు ఆ తర్వాత కావాలనే కలిసి పయనిస్తున్నారు. మొదటి రోజు ముఖ పరిశీలన, రెండో రోజే మో పెదాల రంగస్థలమ్మీద చిరునవ్వుల చిందులాట మూడో రోజు పరిచయాలయ్యాక పిచ్చాపాటి కబుర్లు చెప్పుకున్నారు. ఆ తర్వాత అదే వరుస కొనసాగింది

అదిగో. పద్మ దళాయతాక్షి... పద్మ వయ్యారంగా బస్సు దిగింది. శ్రీనివాసు గుండెల్లో తేనెజల్లు కురిసింది. అదేమిటీ.... రోజు ఒంటరిగా వచ్చేది, ఈరోజు మరో బురఖా లేడీ చేతిలో చెయ్యేసి జంటగా వస్తుందే! దోసిట్లోని దోరమామిడి పండు జారి పోతున్నట్టనిపించిది. పద్మను కళ్ళతో పలకరించాడు. పెదాలు కదలకుండా జవాబిచ్చి ఒళ్ళంతా గిలిగింతలు పెట్టింది. కమ్మగా నవ్వింది. అప్పుడే ఆటో వచ్చి నుంచుంది మొదట పద్మ, తర్వాత బురఖా బుర్రి, చివరగా శ్రీనివాసు ప్రవేశించారు. ఆటో ఝామ్మంటూ బయలుదేరింది. శ్రీనివాసు చిలిపి చూపులు పద్మమీదనే కేంద్రీకృతమైనాయి.

"పానకంలో పుడకలా ఈవిడెవరూ!" వెనక నుండి అడిగాడు సైగలతో.

"ఈమె నా ఫ్రెండ్ . రజియా!" ముందు నుండి పరిచయం చేసి సర్దుక్కూచుంది పద్మ.

వెన్నెలొలికే పద్మ కళ్ళల్లో కళ్ళుగలిని నరదాగా మాట్లాడాలనుంది కాని - భగవంతుడికీ భక్తుడికీ మధ్యన

మాయాదేవిలా ఈ బురఖా ఒహటి

ఆటో పరుగులు చూపుల తచ్చాటలు ఆవిడ అంతరంగ తరంగాలను చదవాలనుంది చూపులటువైపు మళ్ళాయి బురుఖా అడ్డమొచ్చింది ఆటో స్పీడందుకుంది శ్రీనివాసు బుర్రలో సమయస్ఫూర్తి చెమక్కు.. వెనుకపైపు నుండి మెల్లిగా కుడిచెయ్యి వీపుల మీదుగా లేచింది

ఎడమ భజమ్మీదేదో పాకుతున్నట్టనిపించింది. పద్మకు. చూపులటు మళ్ళినై శ్రీనివాసు వేళ్ళు భుజమ్మీద భరతనాట్యం చేస్తున్నే

"అమ్మ దొంగా!" చెయ్యి లాగి పారేసింది. రజియా చెయ్యి పైకి లేచింది. శ్రీనివాసు చెంప ఛెళ్ళుమంది తేలుకుట్టిన దొంగయాడు విధి లేక చూపులు రోడ్డు మీదికి మళ్ళినై

మనసు కుతకుతలాడుతుంది చెంపమీద చీమ పాకుతున్నాట్టుంది కోపమొచ్చింది

"ఛీ.. చీమగ్గాడా లోకువయానా!" కసిగా తన చెంపను తానే వాయించుకున్నాడు. చెంపమీదుంది చీమ కాదు పద్మ చూపుడు వేలు.

రజియాక్కోపమొచ్చింది. పద్మ చెంపను కసిగా గిల్లింది,

"అబ్బా.... మోటు!" అంటూ కందిపోయిన చెంపను అరచేత్తో పట్టుకుంది పద్మ. మనసుల్లో మంటలు లేవకముందే ఫైర్‌స్టేషన్ ముందు ఆటో ఆగింది. ముగ్గురూ దిగి చెట్టుకిందికొచ్చారు వాతావరణం హాయిగా ఉంది.

బురుఖా కిలుక్కున నవ్వింది. పద్మ పకపకా నవ్వింది.

ముద్దు గుమ్మల నవ్వుల తరగలకు పులకించిన కొమ్మలు మెప్పుకోలుగా తలలాడిస్తున్నై.

ఎరక్కపోయి ఇద్దరి మధ్య ఇరుక్కుపోయానేమిటి! ఇబ్బందిపడుతున్న శ్రీనివాసుకేం చెయ్యాలో అర్థం కాలేదు

"మన డ్యూటీలకింకా సమయముంది గదా!" అనగలిగాడు - పెదాల మీద చిరునవ్వు అతికించుకుని

"డ్యూటీకి టైముంది గాని మీ బండారం బద్దలయ్యేందుకింకా సమయం లేదు " గబుక్కున బురఖా తొలగించుకుంది "మీరిద్దరూ తోడు దొంగల్రా!" రెండు చేతుల్తో చెరొకటి అంటించింది డంగై పోవడం శ్రీనివాసు వంతైంది

అరె రజియా రజియా కాదు, రజని తోడబుట్టి కూడా పెరిగిన అల్లరి చెల్లి రజని. మొహం ఇంద్ర ధనస్సైంది ఇప్పుడెలా రియాక్టవాలో సమయస్ఫూర్తి చప్పబడింది కైలాస పర్వాతాన్ని కళ్ళారా చూస్తున్నట్టు

"నువ్వా రజనీ!" నోరెల్లబెట్టాడు "చెల్లినీ, చెలినీ మార్చి మార్చి చూస్తున్నాడు

"అవున్రా అన్నయ్యా నేనే! ఈ పద్మనయన పూర్తి పేరు పద్మావతి నా క్లోజ్ ఫ్రెండ్ . తెల్సా!" రజని కనుబొమ్మలెగిరిపడినై

"ఆ అట్టానా!" మరింత ఆశ్చర్యం

ఊ.. ఈ ఆటోమేట్ గురించి ఏదేదో చెప్పి ఆవిడ మనసులో నువ్వెలాగున్నావో కనుక్కొమ్మన్నావు గదా! ఇది కూడా తక్కువ తినలేదు నీ గురించి చాంతాడంత చెప్పి నీ మనసులో దాని స్థాన మేమిటో కనుక్కోమ్మని బతిమాలింది. ఇద్దరిచేత బతిమాలించుకున్నాను ఇప్పుడు తేల్చి పారేశాను.."

"ఏం తేల్చావే!" పద్మావతి కనుబొమ్మలు తుమ్మెదరెక్కల్లా టపపటపలాడినై

"మీరిద్దరూ ఇద్దరేనని..."

"నీ మొహం. ఇద్దరు ఇద్దరు గాక ముగ్గురౌతారా?"

"అవుతారమ్మయ్ " పద్మ చెంపమీద చిటికేసింది రజని తోడు దొంగలిద్దరు ఈయేడు ఒకటైపోతే వచ్చే యేటికి ముగ్గురైపోతారు. నలదమయంతుల్లా ప్రేమించుకున్నారు. నాది కేవలం హంస రాయబారం

సిగ్గుల భారంతో పద్మావతి బుగ్గలు ఎరుపెక్కినై. ఆగలేక అక్కడే ఆమె చెయ్యందుకున్నాడు శ్రీనివాసు. చెట్టు మీంచి రాలిన పూవులా అతని గుండెల మీద వాలింది జవ్వని.

"ఆ... ఆగంగాగండి. " చూపుడు వేలును పెదాల కానించుకుంది రజని.... "ఆటోమేట్స్ ఆటోమేటిగ్గా ఆలుమగలై

పోతున్నారు గాని  ఇది పబ్లిక్‌ప్లేస్ పడగ్గది కాదు

"అమ్మ పిడుగా! సాయం చేస్తావని మాయంచేస్తున్నావా?" రజని కుడిచెవి అందుకున్నాడు శ్రీనివాసు

"ఇతడు మీ అన్నయ్యని ఒక్కసారిగూడా చెప్పలేదు ఎడమచెవి అందుకుంది పద్మావతి.

"వామ్మో  ఇద్దరి మధ్య ఇరుక్కుపోయాను." పద్మావతి ముక్కందుకుంది రజని . నేను నీ అర్ధమొగుణ్ని సుమా చెప్పినట్టు వినకపోతే ముక్కూడబీకి మూలకేస్తా.. ఖబడ్దార్! ముక్కు విడిచి జడ అందుకుంది.

"నడిబజారు పక్కన నవ్వుల పువ్వులు జలజలారాలిపడినై.

(ఆంధ్రజ్యోతి - వారపత్రిక - 22-10-1999)

